

గురుకులాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో గల ఎపి గిరిజన గురుకుల బాలికల కళాశాల, పాఠశాలను గురుకులం జాయింట్ సెక్రటరీ ఎం.రమణమూర్తి ఆదివారం పరిశీలించారు. గురుకుల పాఠశాలల్లో విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే పదో తరగతి, ఇంటర్ పరీక్షల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా సిఆర్‌టిలు, ఉపాధ్యాయులు పలు సమస్యలపై జాయింట్ సెక్రటరీకి వినతిని అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూను సక్రమంగా అమలు చేయాలని ప్రిన్సిపాళ్లు సూర్యకుమారి, విశ్వనాథం, తిరుపతిరాజు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- 24 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో 18,520 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ స్థానం కోసం మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. దీనికోసం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఓటర్లందరికీ బిఎల్‌ఒల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిచేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో కూడా ఓటరు స్లిప్పులు అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఓటరు స్లిప్పుతోపాటు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని ఓటర్లు తీసుకురావాల్సి ఉంది. పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో అంకెల ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. కలెక్టరేట్ కంట్రోల్ రూము నుంచి ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ పర్యవేక్షించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి వి.విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షిస్తున్నారు.



బ్యాలెట్ పత్రాలు, సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది, అధికారులు



సామాగ్రితో పోలింగ్ కేంద్రాన్ని బయలుదేరుతున్న సిబ్బంది

ప్రజాశక్తి -కలెక్టరేట్

జిల్లాను 5 జోన్లుగా విభజించి 5 మంది జోనల్ అధికారులను నియమించారు. ఎన్నికల సంఘం 24 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లగా నియమించింది. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాకు 48 పెద్ద సైజు బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతో పాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయిందీ, లేనిదీ వంటి సమస్యలు కూడా తెలుసుకుంటారు. జిల్లా కలెక్టర్ ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. 24 కేంద్రాల్లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది


ఎన్నికల నిర్వహణకు సిబ్బంది ఆదివారం ఉదయమే స్థానిక కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి, ఎన్నికల సామగ్రిని, బ్యాలెట్ బాక్సులను, పత్రాలను అందజేశారు. వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి తీసుకొని తరలివెళ్లారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రత్యేకంగా 5ఆర్‌టిసి బస్సులను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. డిఆర్‌ఒ జె.వెంకట్రావు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

24 కేంద్రాలు.. 18,500 మంది ఓటర్లు

జిల్లాలో 18,520 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 12,616, మహిళలు 6,002, ట్రాన్స్‌జెండర్స్ ఇద్దరు. వీరికోసం జిల్లా యంత్రాంగం 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పార్వతీపురంలో ఆరు పోలింగ్ కేంద్రాలున్నాయి.

కోరెడ్ల రమాప్రభకే నా ఓటు

- ఎమ్మెల్సీ ఓటింగ్ వేళ పట్టభద్రుల మనోగతం
- వైసిపి, టిడిపిలను చీదరించుకుంటున్న వైనం
- ఉత్తరాంధ్రా ద్రోహి బిజెపి



'ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకే నా ఓటు. ఎందుకంటే వైసిపి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసింది. గత చరిత్ర రీత్యా అటు టిడిపినీ విశ్వసించలేం. ఆ పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థులకు ఓటేస్తే మన కళ్లు మనం పొడుచుకున్నట్టే!. అందుకే ప్రజాసేవకు అంకితమైన రమాప్రభకు ఈసారి ఓటేద్దామని డిసైడ్ అయ్యాను' ఇదీ సగటు ఓటర్లలో ఎక్కువ మంది నోట వినిపిస్తున్న మాట. రమాప్రభ గెలిచి తీరుతారన్న ఒకింత ధీమా కూడా ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నాడి.. ఎక్కువ మంది కోరెడ్ల రమాప్రభకు అనుకూలం గానూ, టిడిపి, వైసిపి అభ్యర్థులకు వ్యతిరేకం గానూ వినిపిస్తోంది. చాలా చోట్ల టిడిపి, వైసిపి అభిమానులు సైతం రెండో ప్రాధాన్యత ఓటు రమాప్రభకే వేస్తామని చెప్పడం గమనార్హం.

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

వైసిపికి ఓటు వేస్తే మరోసారి మోసపోయినట్టే!

'వైసిపి అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలి? ఈ నాలుగేళ్లుగా ప్రభుత్వం వల్ల ఒరిగిందేమీ లేదు. ఆర్థిక మోసం, వత్తిపరమైన వేధింపులు, బదుల మూత, నిరుద్యోగులకు జాబ్ లెస్ కేలండర్ తప్ప! ఏముంది పాలనలో..?, ఇలాంటి సమయంలో వైసిపికి మరో అవకాశం ఇస్తే మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తుంది.' ఇదీ ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాట.

టిడిపికి, వైసిపికి తేడా లేదు

'ఇప్పుడు టిడిపి అభ్యర్థిని గెలిపిస్తే... ప్రతిపక్షంగా ఉన్న టిడిపి కళ్లు నెత్తికెక్కవన్న గ్యారెంటీ లేదు. గతంలో టిడిపి ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలే అమలు చేసింది. విధాన పరంగా వైసిపి, టిడిపిల మధ్య తేడా ఏమీ లేదు. జెండాలు మారినా అజెండా ఒక్కటే. విద్యారంగాన్ని సర్వనాశనం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే జాతీయ నూతన విద్యావిధానం అమలు, సిపిఎస్ రద్దు, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో అత్యంత కీలకంగా ఉన్న స్టీల్‌ప్లాంట్, తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమల విక్రయం, విభజన హామీ అమలుపై బిజెపిని ప్రశ్నించకపోవడంలోనూ ఈ విషయం స్పష్టంగానే అర్థమైంది. ఈ నేపథ్యంలో టిడిపి తరపున గెలిచే అభ్యర్థి ఉద్యోగ, నిరుద్యోగ, ఉపాధ్యాయుల పక్షంగా కనీసం మాట్లాడే నైతికత ఉండదు.' ఇదీ ఉత్తరాంధ్రలోని పాలకపక్ష పార్టీల పట్ల విసిగిపోయిన ఓటర్ల మాట.

ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన బిజెపి

'రాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు బిజెపి తీవ్ర అన్యాయం చేసింది. నిరుద్యోగులను మోసం చేసింది. రైతులను దగా చేస్తోంది. ఓవైపు దేశభక్తి అంటూనే ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా విదేశీ బహుళ జాతి సంస్థలకు విక్రయిస్తోంది. విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేదు. ఇటువంటి పార్టీ తరపున గతంలో గెలుపొందిన అభ్యర్థి వీటిపై కనీసం నోరుమెదపలేదు. ఇప్పుడు ఓట్లు అడుక్కుంటే ఎలా నమ్మగలం?' ఇదీ బిజెపి బండారం తెలిసిన ఓటర్ల మాట.

కోరెడ్ల రమాప్రభకే మద్దతు

'అసలు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం అంటూ ఉందంటే.. అది శాసనమండలిలో పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) మాత్రమే. ఉద్యోగ, నిరుద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లు ఇలా ఒకటేమిటి? పాలకపార్టీలు అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక, కర్షక, వ్యాపార, వాణిజ్య విధానాలపై నిఖార్సుగా నిలదీస్తున్నారు. ప్రజల గొంతై పనిచేస్తున్నారు. పాలకుల కల్లబొల్లి మాటల్ని బట్టబయలు చేస్తున్నారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా పనిచేస్తున్నారు. అంతెందుకు.... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యులందరికీ హైదరాబాద్ నడిబొడ్డున గచ్చిబౌలిలో ప్రభుత్వం తరపున మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను సున్నితంగా తిరస్కరించిన నిస్వార్థపరులు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు. వారు బలపర్చిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభకే మా ఓటు.' ఇది మెజార్టీ ఓటర్ల మనోగతం.

ఆరంభంలోనే అదుర్స్

38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి ఆరంభం నుంచి ఎండల తీవ్రత అదిరిపోతుంది. మండలంలో గత మూడు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రోజువారీ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఉదయం 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యం గా కనిపిస్తున్నాయి. మార్చిలో ఎండ తీవ్రత ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఇంకా ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఎండల ప్రభావంతో పండ్ల రసాలు, ఐస్‌క్రీముల వినియోగం పెరిగింది. ఎండల ప్రభావం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలు బయటకు వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని భద్రగిరి సిహెచ్ సి వైద్యులు ఆర్.రవికుమార్ సూచించారు. మండుతున్న ఎండలతో చలములు, చెరువులు, బావులు అడుగంటుతున్నాయి. మండు వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పకడ్బందీగా పోలింగ్

- కేంద్రానికి 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలిపివేత
- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి -కలెక్టరేట్

జిల్లాలో పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్వ శ్రీకాకుళం జిల్లా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతుందని ఆయన వివరించారు. పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 8 మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. 18,520 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. 2017 నాటి పట్టభద్రుల ఓటర్లు కంటే రెండు వందల శాతం ఎక్కువగా ఓటర్లను నమోదు చేశామని జిల్లా కలెక్టర్ చెప్పారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఓటర్లకు సమాచారం నిమిత్తం ఓటరు రశీదులను పంపిణీ చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం పరిధిలో వాహనాలను అనుమతించడం జరగదని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల గేటువరకు మాత్రమే మీడియాకు అనుమతిస్తున్నామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అన్ని పార్టీలు, అందరు అభ్యర్థులు విధిగా పాటించాలని ఆయన సూచించారు. ఎన్నికల ఏజెంట్లకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గుర్తింపు కార్డులు జారీ చేశారని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను సూక్ష్మ పరిశీలకులుగా నియమించామని, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేశామని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామని చెప్పారు. 400మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో ఎస్ఐ ఆధ్వర్యంలో బృందాలు పనిచేస్తాయని అన్నారు. మొబైల్ పార్టీలు ఏర్పాటుతో సహా నాలుగు స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు డిఎస్‌పి ఆధ్వర్యంలో ఉంటాయని, ఎస్‌పి, ఎఎస్‌పి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు పనిచేస్తాయని ఆయన చెప్పారు. రిజర్వ్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్లు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు శత శాతం పాటించి ఎన్నికలు సజావుగా, సాఫీగా జరిగేందుకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జరిగే పోలింగ్ కు ఆదివారం ఎన్నికల సామాగ్రిని పోలింగ్ అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశామని ఆయన వివరించారు. ఓటరు విధిగా ఫోటో గుర్తింపు కార్డును తీసుకు వెళ్లి ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు విధిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఎన్నికల సామగ్రి పంపిణీ పర్యవేక్షణను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.వెంకట్రావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, సెక్టారల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కొనసాగుతున్న జెఎసి ఉద్యోగుల నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అమరావతి జెఎసి ఉద్యోగులు ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆదివారం ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసనలు తెలిపారు. స్థానిక ఆర్టీసి డిపోతో పాటు, శాసనమండలి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ తమ కార్యక్షేత్రాల్లో నిరసనలు తెలియజేసినట్లు జెఎసి జిల్లా చైర్మన్, కార్యదర్శి జి.శ్రీరామ్మూర్తి, మరిపి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సాధన కోసం చేపట్టబోతున్న ఈ ఉద్యమానికి అందరి మద్దతు ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లు అన్ని ప్రభుత్వం ఇచ్చిన హామీలేనని, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇంకా జాప్యం జరిగితే ఈ ఉద్యమం ద్వారా ప్రజలకు జరిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సాధన కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు అంకెలతోనే ఓటు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలో జరగనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ విధానం సార్వత్రిక ఎన్నికలకు భిన్నంగా ఉంటుంది. ఈ ఎన్నికలకు అభ్యర్థులకు ఎదురుగా బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు ఉండవు. అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఓటరు పేరుకు ఎదురుగా అంకెతోనే ఓటు వేయాలి. ఓటరు ప్రాధాన్యతా క్రమంలో అభ్యర్థులందరికీ ఓటు వేయొచ్చు. ఓటు ఎలా వేయాలి, ఎలా వేయకూడదనే అంశాలను పొందుపరస్తూ అవగాహన కలిగించడానికి ఎన్నికల కమిషన్ పోస్టర్‌ను రూపొందించింది.


ఓటు ఎలా వేయాలి

- ☑ మీకు ఇచ్చిన బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి.
- ☑ మీరు మొదట ప్రాధాన్యం ఇచ్చే వారికి అభ్యర్థుల ఎదురుగా 1, 2, 3 నంబర్లు లేదా రోమన్ అంకెలు వేయాలి.
- ☑ పోలింగ్ కేంద్రాల్లో ఇచ్చే పెన్ మాత్రమే వాడాలి.
- ☑ ఓటు వేసేందుకు వెళ్లేటపుడు మీ ఐడి ప్రూఫ్ తీసుకొని వెళ్లాలి.
- ☑ బూత్ లోపలకు వెళ్ళే ముందు మీ పేరు చూసుకుని సంతకం పెట్టాలి.
- ☑ కేంద్రం బయట ఓటర్ లిస్టులో మీ పేరు, క్రమ సంఖ్య చూసుకోండి.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 15 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు జరిగే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మజ్జి సత్యనారాయణ వెల్లడించారు. 78 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టంచేశారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లు గురించి ఆయన వివరించారు. ఆ వివరాలు..

- ప్రజాశక్తి, విజయనగరంటౌన్



- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- 78 కేంద్రాల్లో నిఘా నీడలో పరీక్షలు
- హాజరుకానున్న 48,118 మంది విద్యార్థులు
- 'ప్రజాశక్తి'తో ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ ముఖాముఖి

? ఇంటర్ పరీక్ష సమయం ఎన్ని గంటలు? సమయం వెసులుబాటు ఉందా?.

ఈ నెల 15న ఇంటర్ మొదటి సంవత్సర, 16 నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమై, ఏప్రిల్ నాలుగో తేది వరకు జరగనున్నాయి. ఇప్పటికే ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులకు ఎటువంటి అదనపు సమయమూ లేదు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్లోకి అనుమతించరు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలి.

? ఎన్ని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు?.

ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికన పరీక్షలు నిర్వహిస్తున్నాం. మొత్తం 78 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. వీటిలో 42 ప్రయివేటు, 36 ప్రభుత్వ కళాశాలల కేంద్రాలున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు 24,463, ద్వితీయ ఇంటర్‌లో 23,655 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

? కేంద్రాల వద్ద తీసుకున్న చర్యలు?.

ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, లైటింగ్, మరుగుదొడ్లు, మంచినీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆయా శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రెండు సార్లు అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునే విధంగా చర్యలు తీసుకున్నాం.

? మాల్ ప్రాక్టీస్ నివారణకు తీసుకున్న జాగ్రత్తలేమిటి?.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చర్యలతోపాటు అన్నిచోట్లా సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న షాపులు, జెరాక్సు సెంటర్లను మూసివేయాలి. ఈవిషయంపై ఇప్పటికే కేంద్రాల వద్ద ఉన్న షాపుల యజమానులకు చెప్పాం. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు, సిబ్బంది, పోలీసులు, మెడికల్ సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు నిషేధించాం. ఎలక్ట్రానిక్ పరికరాలు ఎవరూ తీసుకెళ్లొద్దని ఆదేశించాం.

? పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?.

పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు 1500 మందిని నియమించాం. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 10 సిట్టింగ్ స్క్వాడ్లు, 78 కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లను నియమించాం.

? ఫీజులు కట్టలేదని హాల్‌టికెట్లను ప్రయివేటు విద్యాసంస్థలు ఇవ్వడం లేదని వస్తున్న ఫిర్యాదులపై మీ స్పందనేమిటి?.

ఏ ప్రయివేటు కళాశాలలోనైనా ఫీజులు కట్టలేదని హాల్ టికెట్ల ఇవ్వకపోతే వెంటనే మా కాల్‌సెంటర్‌కి, లేకుంటే నా నంబర్‌కు ఫోన్ చేయాలి. హాల్ టికెట్లు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకుంటాం. అటువంటి ఇబ్బందులుంటే 08922-237988, 9392911825 నంబర్లను సంప్రదించాలి.



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, నాయకులు

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

సాలూరు : వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో ఘనంగా జరిగింది. డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే 67ఎమ్మెల్యే స్థానాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. 2019 ఎన్నికల్లో 80శాతం సీట్లను గెలుచుకుందన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, వైసిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహనరావుపాల్గొన్నారు.



దేవానంద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న సాహితీవేత్తలు

దేవానంద్‌కు ఉగాది పురస్కారం

గుమ్మలక్ష్మీపురం: సాహితీ చైతన్య కిరణాలు, బాలకథానిలయం ఉపాధ్యక్షులు పాలక దేవానంద్ మాస్టర్‌ను కోనసీమ జిల్లా అమలాపురం నగరంలో సర్ సివి రామన్ కళాశాలలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక ఉగాది సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ తనను ఈ విధంగా సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కవి సమ్మేళనంలో కోయిలలు కూయడం లేదు ఎందుకు అనే కవిత చదివి అందర్నీ అలరించారు. ఉమాకవి దేవానంద్‌కు శ్రీశ్రీ కళావేదిక జాతీయ, అంతర్జాతీయ అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో కవులు బివి సత్యనారాయణ, మోటూరు నారాయణరావు, చిట్టె లలిత, గంపా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



కమాండ్‌నెట్‌పై సందడి చేస్తున్న యువకులు

పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులతో సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చిన పార్కులోని అందాలను ఆశ్వాదించారు. యువకులు బోటు షికారు చేసి ఉల్లాసం చేశారు. యువతీ యువకులు హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచారు. ఆనంద విహార వద్ద నృత్యాలు చేశారు. మరి కొంతమంది స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చుట్టుముట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల ఊగారు. అనంతరం మెట్టుగూడ గూడ జలపాతాన్ని జరిపోతాను సందర్శించారు.

14న మండల సర్వసభ్య సమావేశం

కురుపాం : ఈనెల 14న మంగళవారం మండల పరిషత్ సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో గల మండల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. అలాగే సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కూడా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వాహనాల వేలం

పార్వతీపురం రూరల్ : నాటు సారా రవాణాలో పట్టుబడ్డ వాహనాలను ఈనెల 15న స్థానిక రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎస్సై సింహాచలం ఆదివారం తెలిపారు. వేలం వేయబోతున్న 15 ద్విచక్ర వాహనాలు అప్సెట్ ధరకు తగ్గకుండా ఆసక్తి గల వారు పాడుకోవాలని ఆయన కోరారు.



రజనీకాంత్‌ను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

రజనీకాంత్‌కు సన్మానం

సాలూరు : ఉపాధ్యాయునిగా, రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకునిగా విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ రంభ రజనీకాంత్‌ను నవోదయ యువజన సేవాసమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం నవోదయ సేవాసమితి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. పేదవిద్యార్థులకు ఆటో రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు 23ఏళ్లుగా రామానుజన్ మేథ్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్న రజనీకాంత్ సేవలకు గుర్తింపుగా 17వ వార్డు కౌన్సిలర్ గుల్లిపిల్లి నాగేశ్వరరావు, నవోదయ పాఠశాల కరస్పాండెంట్ గుల్లిపిల్లి రాజగోపాల్ రజనీకాంత్‌ను సన్మానించారు.

నేడు స్పందన రద్దు

సీతంపేట : ప్రతి సోమవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు పిఒ బి.నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కావున ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం

సాలూరు : పట్టణంలోని వెలంపేట రామమందిరం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలకు ఆదివారం స్థానిక పెద్దలు శ్రీకారం చుట్టారు. నవోదయ సేవాసమితి, యువజన సేవా సమితి ఆధ్వర్యాన గత 36ఏళ్లగా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వెలంపేట యువనాయకులు గుల్లిపిల్లి రవి దంపతులు ముహూర్తపురాట వేసి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నవోదయ సేవా సమితి పెద్దలు జి.రాజగోపాల్, జి.నాగేశ్వరరావు,చొక్కాపు గోపి పాల్గొన్నారు.



శ్రీరామనవమి ఉత్సవాలకు రాట వేస్తున్న రవి దంపతులు

ఎపిఎం పని తీరుపై విమర్శలు

●అసభ్యకర పదాలతో విఒఎలపై దురుసు ప్రవర్తన ●లక్ష్యాలను చేరుకోవడంలో విఫలం ●కుర్చీ వీడకుండానే విధుల నిర్వహణ

ప్రజాశక్తి- బలిజిపేట

ఆయన ఒక మండల అధికారి. ఆయన పనితీరు ఆధారంగా ఆ శాఖ అభివృద్ధి, కింద స్థాయి ఉద్యోగుల పనితీరు ఉంటుంది. ఆయన సామర్థ్యం ఆధారంగానే మండలానికి పేరు ప్రతిష్టలు వస్తాయి. కానీ ఆ అధికారి నిర్లక్ష్యం వల్ల మండలం ఇంకా వెనక్కి వెళ్లిపోతూ చెడ్డ పేరు మూటగట్టుకుంటుంది. విధుల్లో నిర్లక్ష్యంతో పాటు మహిళా ఉద్యోగుల పట్ల దురుసు ప్రవర్తన వల్ల అతనంటేనే మహిళలు భయపడుతున్నారు.

వైకెపి ఎపిఎం కె.ఉమామహేశ్వరరావు పనితీరు పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సమావేశానికి హాజరైన విఒఎలను అసభ్యకరమైన పదాలు ఉపయోగించి వారిని మానసికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన చెప్పే విధంగా వినకపోతే చివరికి వారి జీతాలు కూడా ఆపేసి మానసికంగా వేధిస్తున్నాడని అందుకే చాలా మంది విఒఎలు భయపడి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తోంది. మండలంలోని 1637 మహిళా సంఘాలను నాలుగు క్లస్టర్‌గా విడదీశారు. ఈ నాలుగు క్లస్టర్లలో ముగ్గురు సీసీలు పనిచేస్తున్నారు. మండలంలో స్త్రీనిధి రుణాలు 2022 -23కు రూ.8.05కోట్లు లక్ష్యం ఉంటే కేవలం రూ.1.32 కోట్లు మాత్రమే రుణాలు అందించారు. అంటే కనీసం 25 శాతం కూడా పూర్తి కాలేదంటే ఎపిఎం పని విధానం ఏ విధంగా ఉందో అర్థమవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఎపిఎం క్షేత్ర స్థాయిలోకి వెళ్లి మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించకపోవడం వల్లే జరిగిందని తెలిస్తోంది. అర్హులైన వారికి స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్, బ్యాంక్ లింకేజ్ వంటి పథకాలను స్థానికంగా పనిచేస్తున్న 31 మంది విఒఎల సహకారంతో ఈ కార్యాలయం ద్వారా అందిస్తున్నారు. అయితే ఎక్కడికక్కడ నిర్లక్ష్యం వల్ల లక్ష్యం పక్కదారి పడుతోంది. ఉదాహరణకు అరసాడ విఒఎకు డిసెంబర్ నెలకు సంబంధించి స్త్రీనిధి రూ. 5 లక్షలు డిమాండ్ రాగా ఆమె రూ. లక్ష అదే నెలలో జమ చేసింది. కౌంట్ ఫైల్, పాస్ బుక్ అప్డేట్ చేసి కార్యాలయ సిబ్బందికి పంపించిస్తే, వారు ఆ లక్ష రూపాయలను సుభద్ర విఒఎ పేరిట జమ చేసేశారు. డిసెంబర్ నెలలో రూ. 5 లక్షలు ఉన్న డిమాండ్ కాస్త జనవరికి రూ.8 లక్షలకు చేరింది. ఒక్కసారిగా నాలుగు లక్షలు డిమాండ్ పెరగడం, కట్టిన డబ్బులను వేరే విఒఎకు పంపించడం సిసిలు, ఎపిఎం నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేసింది. వాస్తవానికి క్షేత్ర స్థాయిలో విఒఎల పనితీరు బాగున్నప్పటికీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఎపిఎం పనితీరే బాగోలేదని లెక్కలు చెప్పకనే చెబుతున్నాయి.



బలిజిపేట వెలుగు కార్యాలయం

ఉన్నతి పథకంలో భాగంగా ఈ ఏడాది ఎస్‌సి, ఎస్‌టిలకు రూ. 35లక్షలు రుణాలు అందించాలి. కానీ యాప్ ద్వారా ఇంతవరకు ఆ పనులు ప్రారంభించలేదు. బ్యాంకు లింకేజ్ పథకంలో రూ.34.73కోట్లు టార్గెట్ ఉంటే రూ.29 కోట్లు మాత్రమే లింకేజీ రుణాలు చెల్లించారు. పిఎంఇజిపి లోన్ పథకం విషయంలో 10 మందికి రుణాలు ఇవ్వవలసి ఉంటే కేవలం ముగ్గురికి మాత్రమే రుణాలు చేసి మిగతా వారికి చేయడంలో విఫలమయ్యారు. ఎపిఎం ఉమామహేశ్వరరావు, సిసిల మధ్య సమన్వయ లోపం, పైగా ఎపిఎం ఆఫీసు దాటి బయటకు వెళ్లకపోవడంతో లక్ష్యాలను చేరుకోలేని పరిస్థితి ఉందని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన నిర్లక్ష్యానికి విఒఎలను బలి చేస్తూ వారిని పరుష పదజాలంతో దూషించడమే కాకుండా ఉద్యోగం తీసేస్తామని బెదిరించడం కొసమెరుపు..

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించి నమోదైన ఓటర్ల జాబితాలు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో గల మౌలిక వసతులను పరిశీలించి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా తాగునీరు, అన్ని రకాల మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి భద్రతా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎస్సై సిహెచ్ ప్రసాద్ , ఆర్ఐ ప్రసాద్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఎమ్మెల్సీ ఓటింగ్ కోసం భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇక్కడ ఎంతమంది ఓటు హక్కు వినియోగించుకుంటున్నారన్న దానిపై తహశీల్దార్ రాములమ్మను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా చూడాలని సంబంధిత పోలింగ్ సిబ్బందికి సూచించారు. పోలింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండలంలోని 608మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహశీల్దార్ రాములమ్మ తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కనీసం వంద మీటర్ల బయట మాత్రమే పార్టీల టెంట్లు, శిబిరాలు ఉండాలని అన్నారు. అంతేకాక శిబిరాల్లో ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులను మాత్రమే ఉంచాలని, శిబిరాల్లో గందరగోళ పరిస్థితులు ఉండకూడదని అన్నారు.

సీతానగరం :సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల గానూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పూర్తయినట్లు తహశీల్దార్ ఎంవి రామన్న తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో 1258 ఓటర్లు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, ఆ విధంగా బోర్డులను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.నీలకంఠం, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి పోలింగ్ సామాగ్రితో పోలింగ్ అధికారులు జెడ్పీ హైస్కూల్‌కు చేరుకున్నారు. అప్పటికే స్థానిక తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి గదిని పోలింగ్ బూత్ 70 నెంబర్‌గా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించేందుకు అన్ని విధాలా సదుపాయాలు కల్పించారు. పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరా, వెబ్ కాస్టింగ్ కెమెరాలను సిద్ధం చేశారు. మండలంలో 628మంది పట్టభద్రులు ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రం ఆవరణంలో ఎస్సై జగదీష్ నాయుడు 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

సాలూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మూడు కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. సాలూరు పట్టణం, మండలంలోని మొత్తం 2190 మంది పట్టభద్రులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. దీనికోసం ఇన్‌ఛార్జి తహశీల్దార్ భానుప్రసాద్ ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులతో చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. పట్టణంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 144సెక్షన్ విధించారు.

పాలకొండ రూరల్: స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూతులను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు శత శాతం పాటించాలని ఆదేశించారు. ఈయన వెంట అధికారులు, పోలింగ్ సిబ్బంది ఉన్నారు.



కురుపాం : అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్





సాలూరు, కొమరాడలో పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి -సీతంపేట

విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ నవీన్ కుమార్, కరస్పాండెంట్ ఎస్‌పి పెంటయ్య ఆకాంక్షించారు. మండలంలో పులిపుట్టి సమీపంలో గల భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోల సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు తక్కువ సమయం ఉందని, కావున ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి ఒక మూలస్తంభామన్నారు. ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే విజయం తప్పనిసరిని అన్నారు. పరీక్షల అనంతరం ఖాళీగా ఉండకుండా పోటీ పరీక్షలకు చదుకోవడం, కంప్యూటర్ శిక్షణ పొందడం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, మురళి, అప్పలనాయుడు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాజీ సైనికుల వినతి

ప్రజాశక్తి- బొబ్బిలి

వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డి దామోదర్‌రావు ఆధ్వర్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ భవనానికి బొబ్బిలిలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు మాట్లాడుతూ సరిహద్దుల్లో దేశ భద్రత కోసం అహర్నిశలు పోరాడి పదవి విరామం చెందిన తరువాత మాజీ సైనికులుగా తమకంటూ దేశ భక్తి వ్యక్త పరచడానికి, సైనిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఓ ప్రత్యేక భవనం నిర్మాణ కోసం స్థలం కేటాయించాలని కోరారు. గతంలో మిలిటరీ కాలనీ తమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని, ఇప్పుడు కూడా తమను, భావితరాలను దృష్టిలో పెట్టకుని స్థలం కేటాయించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం తమ సమస్యను తీర్చేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా గవర

ప్రజాశక్తి - కొత్తవలస

విజయనగరంలో ఆదివారం జరిగిన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలలో కొత్తవలసకు చెందిన జాతీయ క్రీడాకారులు, విశాఖ పోర్ట్ ట్రస్ట్ వాలీబాల్ చీఫ్ కోచ్ గవర సూరిబాబు జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా దెందేరు ఉన్నత పాఠశాల వ్యాయామ సంచాలకులు కె. కృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా జాతీయ వాలీబాల్ రిఫరీ ఎల్‌జిఎన్ కుమార్, కార్యవర్గ సభ్యునిగా సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు పాల్తేటి శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరిని కొత్తవలస మండల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సభ్యులందరూ అభినందించారు.

నేరాలు ఘోరాలు

పెదగెడ్డ జలాశయంలో పడి వ్యక్తి మృతి

పాచిపెంట: సాలూరు పట్టణానికి చెందిన పెంట రాము (30) ఆదివారం పాచిపెంట పెద్దగెడ్డ జలాశయంలో దూకి మృతి చెందాడు. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు పట్టణానికి చెందిన పెంట రాము లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం అతని భార్య ప్రసవం నిమిత్తం కన్నవారింటికి వెళ్ళింది. ఈ క్రమంలో రాము పూర్తిగా మద్యానికి బానిసవ్వడంతో భార్య తరచూ మందలించేది. ఈ మేరకు ఆదివారం స్నేహితుడు చంటితో కలిసి పాచిపెంట పెద్దగెడ్డ జలాశయం వద్ద ఇద్దరూ కూర్చొని మాట్లాడారు. అనంతరం రాము ఫోను మాట్లాడుతానంటూ జలాశయంలో దూకి మృతి చెందాడు. రాము తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ బెల్లాన ముసలయ్య తెలిపారు.



మృతి చెందిన రాము

400 లీటర్ల సారా క్యాన్లు స్వాధీనం

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల రెస్టారెంట్ వెనుక రైల్వే ట్రాక్ సమీపా బురద నీటి, తుప్పల్లో 400 లీటర్ల నాటు సారా పట్టుబడింది. ముందస్తు సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో ఎస్‌ఐ, సిబ్బందిసాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఈ నాటు సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం విచారణ చేయగా, మున్సిపాలిటీ పరిధిలో గల కొత్తవలసకు చెందిన వెలగడ సాగర్ ఒడిషా రాష్ట్రానికి చెందిన ముత్యాలు వద్ద కొని ఇక్కడ దాచినట్టు తెలిసింది. దీంతో వీరిద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

ఉత్కళాంధ్ర ఆదివాసీల ఆరాధ్యం నీలావడి అగ్నిగంగమ్మ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లాకు 20కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిషాలోని కొరాపుట్ జిల్లా, బందుగాం బ్లాక్, నీలావడిలో వెలసిన ఉత్కళాంధ్రా ఆదివాసీల ఆరాధ్యదైవం అగ్నిగంగమ్మ అమ్మవారి పండగ ఈనెల 13,14,15 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనుంది. ఈ పండగ సందర్భంగా జరిగే జాతరలో ఉత్తరాంధ్రకు చెందిన మూడు జిల్లాలతో పాటు ఒడిషా, చత్తీస్‌గడ్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. గత రెండేళ్లుగా కరోనా ప్రభావంతో వాయిదా పడ్డ తరువాత ఈ ఏడాది జరుగుతున్న పండగకు అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తారని నిర్వాహక కమిటీ అంచనా వేసింది. అందుకు తగ్గట్టుగా ఒడిషా ప్రభుత్వం 3లక్షల మంది భక్తులు దర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తుంది.

జాతరకు విస్తృతం ఏర్పాట్లు

నీలవాడి పండగ జాతరలో దూరం ప్రాంతాల నుంచి ఎక్కువగా ఆదివాసీ కుటుంబాలతో సహా పాల్గొంటాయి. ఈ జాతర జరిగే మూడురోజుల్లో సుమారు వందల కొద్ది అంగళ్లు, దుకాణాలు వెలిసి కోట్లాది రూపాయల వ్యాపారాలు జరుగుతాయి. జాతర నిర్వహణకు ఈ ఏడాది సుమారు రూ.15లక్షలు వెచ్చించి ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దమే కాకుండా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్‌లతో పాటుగా, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు అగ్ని గంగమ్మ పూజా కమిటీ అధ్యక్షులు బి.సత్యంనాయుడు తెలిపారు. అమ్మవారి ప్రసాదాల విక్రయం, తాత్కాలిక దుకాణదారుల నుంచి అద్దెలు, ప్రసాదాలు, ఫోటోల విక్రయం, కానుకల రూపంలో వచ్చే అదాయంలో కొంత మొత్తం ప్రతిఏటా ఉత్సవాల కోసం ఖర్చు చేస్తునట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం జరిగిన జాతర సందర్భంగా రూ.20లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది ఎక్కువ వచ్చే అవకాశం ఉందని, కమిటీ సభ్యులు తెలిపారు.

ఆదివాసీలే అర్చకులుగా నిర్వహించే ఆలయం

అమాయకులైన ఆదివాసీ బిడ్డలను క్రూరమృగాలతో పాటు, సంసారిక బాధల నుంచి తప్పించేందుకు ఆదివాసీ మహిళే అగ్నిగంగమ్మగా వెలసి తమను నిరంతరం తనను దర్శించిన వారిని కాపాడుతుందని చెప్పే స్థల పురాణం ఈ విధంగా ఉంది. ఒడిశాలోని జైపూర్ సంస్థానాధీసులు మహావీర ప్రతాప్ ద్వితీయ విశ్వంబరదేవ్ పాలిస్తున్న కాలంలో దట్టమైన అటవీ ప్రాంతాలైన నీలావడి కుంభికోట, పుస తదితర ప్రాంతాల్లో ఆదిమ తెగకు చెందిన దొరలు నివసిస్తుండేవారు. ఆ సమయంలో నీలావడిలో క్రూరమృగాల బారినపడి ఎంతో మంది ప్రతిరోజూ చనిపోతుండేవారు. దీన్ని అరికట్టాలని రాజును ప్రజలు కోరుకున్నారు. ఈ క్రమంలో క్రూరమృగాలను అంతమొందించి ప్రజలను రక్షించేందుకు రాజు తన సైన్యంతో అడవిలోకి వెళ్తాడు. అయితే వీరిపై క్రూరమృగాలు వాడి చేస్తాయి. అనంతరం అలసిన రాజు, అతని సైన్యం ఒక ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటారు. అనుకోకుండా ఆ సమయంలో విపరీతమైన గాలివాన రావడంతో సైన్యం అంతా చెల్లాచెదురవుతుంది. రాజు అతి కష్టం మీద ఒక చెట్టును పట్టుకొని ఉండిపోయి: ప్రాణాలను కాపాడుకుంటాడు. అయితే ఆకలి, దప్పిక కారణంగా బాధపడుతున్న రాజుకు ఒక బాలిక కనిపించి తాగేందుకు నీరు, తినేందుకు ఆహారం ఇస్తుంది. అనంతరం ఆ బాలిక వల్ల తన ప్రాణాలు దక్కాయని భావించిన రాజు ఆ బాలికను తన రాజ్యానికి తీసుకెళ్లాడు. ఆపద సమయంలో కాపాడిన ఆ బాలికే అగ్ని గంగమ్మగా పేరొందిందని స్థల పురాణం చెబుతుంది. ఆనాటి నుంచి అమ్మవారిని కొలిచేవారు అడివి దొరలే. ఆదిమ తెగకు చెందిన వీరంతా అమ్మవారికి సేవకులుగా పనిచేస్తూ జీవనం కొసాగిస్తున్నారు. ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయం ఆభివృద్ధి కోసం ఒడిషా ప్రభుత్వం కోటిరూపాయిలు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం విశేషం.



ఘటాలకు పూజలు చేస్తున్న యాత్రికులు



ఉత్సవాల సందర్భంగా ముస్తాబయిన అగ్ని గంగమ్మ ఆలయం